# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 278
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
ఆగస్టు 11, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




2లో..

## ప్రజావాణి ఫిర్యాదులకు వారం లోగా పరిష్కారం చూపాలి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



# అటవీ భూమి అమ్మకం..!

## కాళేశ్వరం, మెట్టుపల్లిలో ఇష్టారాజ్యం

- ఆక్రమణకు గురవుతున్న అటవీ భూమి
- తప్పుడు పత్రాలతో ప్రభుత్వ భూమికి ఎసరు
- నూతన బస్టాండ్ సమీపంలోనే షెడ్ల నిర్మాణం
- జిల్లా స్థాయి అధికారికి ఫిర్యాదు చేసిన స్పందన కరువు



వివరాలు2లో..

మహాదేపూర్ మండలంలోని మెట్టుపల్లి గ్రామంతో పాటు కాళేశ్వరం అటవీ భూములను అంగడిలో పుట్నాలు, బెల్లంలాగా అమ్ముకుంటున్నారు. దోచుకున్నోడికి దోచుకున్నంత అన్న చందంగా సాగుతోంది దందా. భూ కబ్జాదారులుగా అవతారమెత్తిన రాజకీయ నాయకులకు అటవీ శాఖ అధికారులు అండగా నిలువడంతో ఇక వారి అక్రమాలకు అడ్డూ, అదుపూ లేకుండా పోతోంది. ఇప్పటికే మెట్టుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కన్నెపల్లి శివారు పంప్ హౌస్ సమీపంలోని భూమికి కొందరు తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి దాదాపు 15 ఎకరాల భూమిని కాజేశారు. ఇక కాళేశ్వరంలో నూతనంగా బస్టాండ్ నిర్మాణం కోసం అధికారులు స్థలం పరిశీలన చేయడమే ఆలస్యం ఆ పక్కనే ఉన్న అటవీశాఖకు చెందిన భూమిలో ఏకంగా షెడ్ల నిర్మాణాలు చకచకా జరిగిపోయాయి. రాత్రీపగలు అని తేడా లేకుండా షెడ్ల నిర్మాణం జరుగుతున్నా అడ్డుకోవాల్సిన అటవీ శాఖ అధికారులు ప్రేక్షకపాత్ర పోషించడం అనుమానాలకు తావిస్తోంది. జీవనోపాధికోసం పోడు చేసుకున్న రైతులపై తమ ప్రతాపాన్ని చూపిస్తున్న అటవీ శాఖ అధికారులు తమ కళ్ల ఎదుటే అటవీ భూమి అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అటవీ భూమి పరిరక్షణకు జిల్లా అధికారులు నడుం బిగించాలని స్థానికులు కోరుతున్నారు.

– వరంగల్ వాయిస్, మహాదేవపూర్



8లో..

## గ్రామీణ యువతకు ఈ-కామర్స్ శిక్షణ

- విస్తరించాలని కోరిన ఎంపీ కడియం కావ్య
- స్పందించిన కేంద్ర మంత్రి జయంత్ చౌదరి




## సన్నద్ధంగా ఉండండి..

- నెలాఖరులో 'స్థానిక' నగారా
- క్యాడర్‌కు టీపీసీసీ ఆదేశాలు

8లో..



## రాష్ట్రవ్యాప్తంగా ఫామ్ ఆయిల్ ఫ్యాక్టరీలు

- వ్యవసాయ సాగుకు ములుగు జిల్లా అనుకూలం
- వ్యవసాయాన్ని పండుగగా మారుస్తున్న ప్రజా ప్రభుత్వం
- మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క



2లో..



2లో..

## క్రీడల్లో రాణించే పోలీసులను ప్రోత్సహిస్తాం

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

సోమవారం, ఆగస్టు 11, 2025



# అటవీ భూమి అమ్మకం..!

- కాళేశ్వరం, మెట్టుపల్లిలో ఇష్టారాజ్యం
- ఆక్రమణకు గురవుతున్న అటవీ భూమి
- తప్పుడు పత్రాలతో ప్రభుత్వ భూమికి ఎసరు
- నూతన బస్టాండ్ సమీపంలోనే షెడ్ల నిర్మాణం
- జిల్లా స్థాయి అధికారికి ఫిర్యాదు చేసిన స్పందన కరువు

**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం దట్టమైన అడవులకు నెలవు. ఇక్కడి సుందరమైన, విశాలమైన నది తీర ప్రాంతం అందనినీ ఆకట్టుకుంటుంది. ఈ అటవీ ప్రాంతంలోకి పులులు, సింహాలు వచ్చినా కూడా తిరిగి వెళ్లలేనంత అనువైన ప్రాంతం. అయితే ఈ అడవిని రక్షించాల్సిన వాళ్లే బక్షిస్తుంటే పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహాదేవ్‌పూర్ మండలంలోని మెట్టుపల్లి గ్రామంతో పాటు కాళేశ్వరంలో ఎకరాలకు ఎకరాల అటవీ భూమిని ఆక్రమిస్తుంటే అటవీ శాఖ అధికారులు మాత్రం వారికి ముడుతున్న నెలవారీ మామూళ్లకు ఫిదా అవుతున్నారు. మెట్టుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కన్నెపల్లి శివారు పంప్ హౌస్ సమీపంలోని అటవీ భూమిని కొందరు వ్యక్తులు తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి దాదాపు 15 ఎకరాల భూమిని కాజేశారు.

### హాట్ కేక్ ..

ఇదిలా ఉండగా కాళేశ్వరం అంటేనే ఒక్క హాట్ కేక్ లా మారింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ మొదలుకొని రీసెంట్ గా జరిగిన సరస్వతి పుష్కరాల వరకు ప్రచారం ఓ రేంజిలో వెళ్ళింది. అదే ఇక్కడి భూమికి అమాంతంగా రెక్కలు వచ్చేలా చేసింది. భూమికి డిమాండ్ పెరగడంతో అక్రమార్కులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. అడ్డూ అదుపు లేకుండా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. నూతనంగా బస్టాండ్ నిర్మాణం కోసం అధికారులు స్థల పరిశీలన చేయడమే ఆలస్యం ఆ పక్కనే ఉన్న అటవీశాఖ భూమి అక్రమార్కుల కన్ను పడింది. గ్రీన్ మ్యాట్ లు ఏర్పాటు చేసి ఏకంగా షెడ్ల నిర్మాణాలే చేపడుతున్నారు. రాత్రి, పగలు అని తేడా లేకుండా షెడ్ల నిర్మాణం జరిగిపోతోంది.

### రాజకీయ అండ..

ఇందులో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ప్రజా ప్రతినిధి భర్త, మరో ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యులకు వాటాలు ఉన్నట్టు సమాచారం. ఈ వాటాల పంపకం సైతం అటవీ శాఖ అధికారులు దగ్గరుండి జరిపించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అటవీశాఖ భూములను పరిరక్షించాల్సిన అధికారులే మామూళ్ల మత్తులో జోగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. బుక్కెడు మెతుకులకోసం పోడు చేసుకుంటున్న అమాయక గిరిజనులపై దాడులకు పాల్పడుతున్న అటవీశాఖ అధికారులు అటవీ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా దర్జాగా ఇంటి నిర్మాణం చేపడుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ఈ నిర్మాణం పక్కనే అటవీశాఖకు సంబంధించిన వాహన రుసుము వసూలు చేసే కేంద్రం ఉన్నప్పటికీ ఏ ఒక్కరు కూడా అక్రమంగా జరుగుతున్న నిర్మాణాలను ఆపలేక పోతున్నారు. అయితే స్థానికంగా ఉన్న ఒక హస్తం నాయకుడి కనుసన్నల్లోనే ఈ తతంగం అంతా సాగుతున్నట్లు స్థానికులు గుసగుసలాడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటవీ సంరక్షణ కోసం వందల కోట్లు వెచ్చిస్తుంటే అటవీశాఖ అధికారులు మాత్రం తమకు మామూళ్లు వస్తే చాలు అన్న చందంగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే కొందరు స్థానికులు జిల్లా స్థాయి అధికారికి ఫిర్యాదు చేసినప్పటికీ కూడా ఎలాంటి ఫలితం లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అటవీ భూమిని ఆక్రమించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని వారికి సహకరించిన అటవీ శాఖ అధికారులపై శాఖపరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులకు వారం లోగా పరిష్కారం చూపాలి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

**వరంగల్ వాయిస్, బల్దియా:** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వారం రోజుల్లోగా పరిష్కరించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఉన్నతాధికారులు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా శానిటేషన్ విభాగానికి సంబంధించిన ఫిర్యాదులను 24 గంటల్లోగా పరిష్కరించాలని, గార్బేజ్ బిన్‌లను ఎత్తడం లేదన్న ఫిర్యాదులపై తక్షణమే దృష్టి సారించాలని అన్నారు. శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, పన్నుల విభాగానికి చెందిన ఈ వారంలో వచ్చిన ఫిర్యాదులు వచ్చే వారం నాటికి పెండింగ్‌లో ఉండకుండా పరిష్కరించాలని స్పష్టం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో ఓపెన్ ప్లాట్లలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్త వల్ల దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని కమిషనర్ హెచ్చరించారు. అలాంటి ప్లాట్‌ల యజమానులు తమ స్థలాలను శుభ్రం చేసుకునేలా సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ నెల 21 వరకు నగరంలో బోనాల పండుగలు జరుగుతున్నందున, ఆలయాల వద్ద విద్యుత్, శానిటేషన్ ఏర్పాట్లతో పాటు పరిశుభ్రతను పాటించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని కమిషనర్ సూచించారు. విభాగాల వారీగా అందిన ఫిర్యాదుల ఇంజినీరింగ్: 23, హెల్త్ & శానిటేషన్: 11, ప్రాపర్టీ టాక్స్ (రెవెన్యూ): 09, టౌన్ ప్లానింగ్: 44, హార్టికల్చర్: 02, ఎలక్ట్రికల్: 02, మొత్తం: 91 ఫిర్యాదుల అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, ఇంఛార్జి ఎస్.ఈ., సిటీ ప్లానర్లు మహీందర్, రవీందర్ రాడేకర్, సీహెచ్ఓలు రమేష్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణించే పోలీసులను ప్రోత్సహిస్తాం

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** క్రీడల్లో ప్రతిభ కనబరిచే పోలీసు అధికారులకు, సిబ్బందికి అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హన్మకొండ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ నిర్వహించిన లాన్ టెన్నిస్ డబుల్స్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన ఏ.ఆర్. ఏసీపీ నాగయ్య, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌లను సీపీ క్యాంపు కార్యాలయంలో ఆయన అభినందించారు.
ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నిరంతరం విధి నిర్వహణలో బిజీగా ఉండే పోలీసులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ఇస్తాయని తెలిపారు. క్రీడల్లో రాణించేవారికి శాఖాపరమైన ప్రోత్సాహకాలతో పాటు, నగదు రివార్డులు కూడా అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న పోలీసులందరినీ ప్రోత్సహిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఫామ్ ఆయిల్ ఫ్యాక్టరీలు



**వరంగల్ వాయిస్, ములుగు :** ఫామ్ ఆయిల్ పంట సాగు చేస్తున్న రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఫామాయిల్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేస్తామని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, వస్త్రాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ములుగు మండలం ఇంచర్లలో కేఎన్ బయోసైన్స్ కంపెనీ ఏర్పాటు చేస్తున్న ఫామాయిల్ ఫ్యాక్టరీ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ములుగులోని 12 ఎకరాల స్థలంలో నిర్మించనున్న ఈ ఫ్యాక్టరీకి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ సంచాలకులు షేక్ యాస్మిన్ భాషా, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఇంచర్లలోని ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ములుగు జిల్లా పర్యాటక రంగంతో పాటు వ్యవసాయానికి కూడా అనుకూలమని తెలిపారు. మంత్రి సీతక్క జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. రైతులు తమ భూముల్లో కొంత భాగాన్ని ఫామ్ ఆయిల్ సాగుకు కేటాయించాలని, మొక్కలు నాటిన మూడేళ్ల తర్వాత అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు. జిల్లాలో 10 వేల ఎకరాల్లో ఫామ్ ఆయిల్ సాగు కోసం రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.ప్రస్తుతం ఫామ్ ఆయిల్ గింజల ధర టన్నుకు రూ.18,052 ఉండగా, రైతుల కోసం దానిని రూ.25,000కు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. నూతన ఫ్యాక్టరీ పనులను ఉగాది లోపు పూర్తి చేసి ప్రారంభిస్తామని చెప్పారు.

### రైతులకు ప్రోత్సాహకాలు..

మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఫామ్ ఆయిల్ పంట సాగుకు శ్రమ తక్కువగా ఉండి, ఎక్కువ లాభం ఉంటుందని తెలిపారు. ఈ పంట ద్వారా ప్రతి సంవత్సరం లక్ష రూపాయల ఆదాయం పొందే అవకాశం ఉందని, రూ.200 విలువ చేసే మొక్కను ప్రభుత్వం కేవలం రూ. 25కే అందిస్తోందని చెప్పారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పంట పూర్తయ్యాక కంపెనీలే నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తాయని అన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, జిల్లా కేంద్రంలో ఐటీ కంపెనీ ఏర్పాటుకు భవనాలు నిర్మిస్తున్నామని వివరించారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, ఫామ్ ఆయిల్ సాగులో ఎలాంటి ఇబ్బందులు ఉండవని, రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, గ్రంథాలయ చైర్మన్ బానోతు రవి చందర్, హార్టికల్చర్ అధికారి సంజీవరావు, కేఎన్ బయోసైన్స్ కంపెనీ ఎండీ సుధారెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేయాలి

◆ టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి
◆ తొర్రూరులో కాంగ్రెస్ నాయకులతో సమీక్షా

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, వార్డు కోఆర్డినేటర్లు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులతో సమీక్షా సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి, కార్యకర్తలతో విస్తృతంగా చర్చించారు. ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడానికి గ్రామం నుండి పట్టణం వరకు అన్ని స్థాయిలలో సమైక్యంగా పని చేయాలని ఆమె సూచించారు. వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి, కాంగ్రెస్ పార్టీ గెలుపు అనే ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నారు. తాటాకు చప్పుళ్లకు భయపడనని, ప్రజల ప్రేమే తన బలమని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన కృషి కొనసాగుతుందని తెలిపారు. కాంగ్రెస్ సిద్ధాంతాల కోసం గాంధీ-నెహ్రూ స్ఫూర్తితో తన జీవితాన్ని అంకితం చేశానని ఆమె గుర్తు చేశారు. ఈ సందర్భంగా



పట్టణ అధ్యక్షులు, వార్డు కోఆర్డినేటర్లు తమ ప్రాంతాలలోని పార్టీ పరిస్థితి, బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యకర్తల్లో ఉత్సాహం చూసి సంతోషం వ్యక్తం చేసిన ఝాన్సీ రాజేందర్ రెడ్డి, ప్రతి ఇంటికీ కాంగ్రెస్ పార్టీ సందేశాన్ని తీసుకెళ్లాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారం కోసం స్థానిక స్థాయిలో కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆమె కార్యకర్తలతో స్నేహపూర్వకంగా మాట్లాడి, వారిలో ఉత్సాహం నింపారు.



### నూతన వధూవరులను ఆశీర్వదించిన ఝాన్సీ..

తొర్రూరు పట్టణంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు కుషాల్ అన్న కుమారుడి వివాహ వేడుకకు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆమె ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట బ్లాక్, పట్టణ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అయిత ప్రకాష్ రెడ్డికి మంత్రి శ్రీధర్ బాబు పరామర్శ



**వరంగల్ వాయిస్, మల్హర్ :** తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్, భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అయిత ప్రకాష్ రెడ్డిని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదివారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన ప్రకాష్ రెడ్డి తల్లి అయిత లక్ష్మీ బాయి మృతి పట్ల మంత్రి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుతో కలిసి మంత్రి శ్రీధర్ బాబు ప్రకాష్ రెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ ప్రకాష్ రెడ్డి, ఆయన సోదరుడు కరుణాకర్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మల్హర్ మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్ రావు, డీసీసీ ప్రధాన కార్యదర్శి అయిత రాజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో కవుల పాత్ర గొప్పది

ఏసీపీ కూజా విజయకుమార్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కవులు తమ రచనల ద్వారా సమాజంలో మంచి మార్పులు తీసుకురాగలరని, వారి చిన్న చిన్న పదాలలో కూడా గొప్ప అర్థం దాగి ఉంటుందని మామునూరు పోలీస్ ట్రైనింగ్ కళాశాల ఏసీపీ కూజా విజయకుమార్ అన్నారు. నక్కలగుట్టలోని ఒక వేడుకల మందిరంలో ప్రముఖ కవయిత్రి బాదం జయశ్రీ, వెంకటేశ్వర్లు దంపతుల షష్టిపూర్తి సందర్భంగా ఆమె రచించిన 60 కవితల పుస్తకాన్ని ఆయన ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈ కవితలు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసే విధంగా ఉన్నాయని ప్రశంసించారు. తన భర్త బాదం వెంకటేశ్వర్లుకు ఈ పుస్తకాన్ని అంకితం చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సౌమ్య, రాకేష్, రెయాన్ష్, నిఖిల్ సామ్రాట్, సాహితి, సాగంటి మంజుల, మానస, రామనరసింహస్వామి, శ్రీధర స్వామి తదితరులు పాల్గొన్నారు.

# మార్త భద్రయ్యకు ప్రముఖుల నివాళి



**వరంగల్ వాయిస్, ఎలకుర్తి హవేలి :** తెలంగాణ ప్రభుత్వం, నిమ్స్ (ఆర్ఎంఓ) లైజనింగ్ ఆఫీసర్ డా. మార్త రమేష్ తండ్రి కీ.శే. మర్త భద్రయ్య దశ దిన కర్మ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు బూర మల్లేశం, అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షులు దుస్స శివశంకర్, మహిళా విభాగం అధ్యక్షురాలు కొండా పద్మక్క, చంద్రమోహన్, జెల్లా వెంకటేశ్వర్లు, సిలివేరు సుదర్శన్, కర్నాటి మహేందర్, వలుపదాసు శ్యామసుందర్, దేవులపల్లి రజినీకాంత్, ఆడెపు రాజమణి, బాల్నే శరత్ బాబు తదితరులు హాజరయ్యారు. అదే విధంగా పద్మశాలి ప్రముఖులు పరికిపండ్ల నరహరి ఐఏఎస్, పరికిపండ్ల వేణు, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, సాంబారి సమ్మారావు, ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, వేముల సదానందం, ఇతర కుల ప్రముఖులు పాల్గొని మృతుని ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. డా. మార్త రమేష్, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# పోచమ్మ తల్లికి విశ్వబ్రాహ్మణుల తొలి బోనం

**వరంగల్ వాయిస్, రేగొండ:** శ్రావణమాసం సందర్భంగా రేగొండ మండల కేంద్రంలోని పోచమ్మ తల్లి ఆలయంలో వార్షిక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం సాయంత్రం స్థానిక విశ్వబ్రాహ్మణ కులస్తులు తమ ఆచారం ప్రకారం అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. ఉత్సవాల నేపథ్యంలో విశ్వబ్రాహ్మణ కులస్తులు గత కొద్ది రోజులుగా ఆలయ శుద్ధి కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ పూజారి గుంటోజు రాజయ్య తెలిపిన వివరాల ప్రకారం, ప్రతి ఏటా వీరు వేయి కండ్ల తొలి బోనం సమర్పిస్తారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. విశ్వబ్రాహ్మణ కుల సంఘ సభ్యులు సేకరించిన బియ్యం, పసుపు, కుంకుమ, ఇతర పూజా ద్రవ్యాలతో తొలి బోనం తయారు చేసి అమ్మవారికి సమర్పించారు. అనంతరం యాట పోతులను బలి ఇచ్చారు. బుధవారం నుంచి గ్రామ ప్రజలందరూ బోనాలు సమర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కుల సంఘ సభ్యులు గుంటోజు కిషన్ చారి, చంద్రశేఖర్, పెద్ద రవి చారి, రాములు, రవి చారి, బుగిలయ్య చారి, గుంటోజు రవీంద్ర చారి, రాకేష్ చారి తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ మహాదేవ స్వామి ఆలయంలో పూజలు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండల కేంద్రంలోని శ్రీ మహాదేవ స్వామి ఆలయం శ్రావణ మూడవ సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి అభిషేకాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కూరెళ్ల పెద్ద ఉపేందర్ గుప్తా, వారి సతీమణి రేణుక మాట్లాడుతూ ప్రజలందరిపై మహా శివుడి ఆశీస్సులు ఉండాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనగామకు చెందిన హరీష్-కవిత దంపతులు, సీనియర్ జర్నలిస్ట్ చింతకింది కృష్ణమూర్తి-రాజేశ్వరి, లగిశెట్టి లింగయ్య దంపతులు, పోకల పోషనాథం, పోకల హరిప్రసాద్, గందె మంజుల, ఆలయ ప్రధాన అర్చకులు పిండిప్రోలు శ్రీనివాస్ శర్మ, బచ్చు శ్రీనివాస్ గుప్తా, కూరెళ్ల వేద కుమార్ గుప్తా, వినయ్ కుమార్ గుప్తా, మహిళలు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణతోనే పిల్లల ఎదుగుదల

◆ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**వరంగల్ వాయిస్, జనగామ :** పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు ఆటంకం కలిగించే నులిపురుగులను నిర్మూలించడం అత్యంత ముఖ్యమని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాz షేక్ అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా సోమవారం తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల/కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. పేగుల్లో నులిపురుగులు ఉండటం వల్ల పిల్లలు నీరసం, రక్తహీనతతో బాధపడతారని, చదువులో ఏకాగ్రత కోల్పోవడం వంటి సమస్యలు వస్తాయని కలెక్టర్ వివరించారు. ఈ సమస్యలను నివారించడానికి ప్రభుత్వం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తుందని తెలిపారు. జిల్లాలోని 1,13,888 మంది విద్యార్థులకు ఈ మాత్రలు వేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. నులిపురుగుల వల్ల ఆకలి మందగించడం, విరోచనాలు, బరువు తగ్గడం వంటి సమస్యలు వస్తాయని, వీటిని నివారించడానికి ఏడాది నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలు వైద్యుల సూచన మేరకు ఆల్బెండజోల్



మాత్రలు వేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, చేతి గోర్లను పరిశుభ్రంగా పెట్టుకోవడం ద్వారా నులిపురుగుల సంక్రమణను అరికట్టవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు వాడటం వల్ల నులిపురుగులు తగ్గిపోయి, రక్తహీనత నియంత్రణలోకి వస్తుందని, పోషకాహారం కూడా శరీరానికి బాగా అందుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి మల్లికార్జున రావు, కళాశాల ప్రిన్సిపాల్, వైద్య సిబ్బంది

# గణపురం సీఐగా కరుణాకర్ రావు



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రానికి నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా నియమితులైన సీహెచ్ కరుణాకర్ రావును భూపాలపల్లి నియోజకవర్గ శాసనసభ్యుడు గండ్ర సత్యనారాయణ రావు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందించారు. ఇంతకుముందు ఎస్సైగా బాధ్యతలు నిర్వర్తించిన కరుణాకర్ రావు పదోన్నతి పొందడంతో వారు ఆయనకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కొత్త బాధ్యతల్లో కూడా ఆయన ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రంగంపేటలో పోచమ్మ బోనాల సందడి



**వరంగల్ వాయిస్, సంగెం :** మండలంలోని మండలం ఎలుగురు రంగంపేట గ్రామంలో ఆదివారం పోచమ్మ తల్లి బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా గ్రామంలోని మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ గుడికి బయలుదేరారు. అమ్మవారి ఆలయానికి చేరుకున్న అనంతరం మహిళలు పోచమ్మ తల్లికి నైవేద్యం, చీర, సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి కోళ్లు, గొర్రెలను బలి ఇచ్చి తమ భక్తిని చాటుకున్నారు. ఈ బోనాల పండుగతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

# పరకాల యువకుడికి మాస్టర్స్ పట్టా



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణానికి చెందిన చందుపట్ల సుహాసిని, రాఘవరెడ్డి దంపతుల కుమారుడు సాయి శ్రీమంత్ రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త, మహేంద్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆనంద్ మహేంద్ర చేతుల మీదుగా తన మాస్టర్ డిగ్రీ పట్టాను అందుకున్నారు. హైదరాబాద్‌లోని మహేంద్ర విశ్వవిద్యాలయం నాలుగో స్నాతకోత్సవం సందర్భంగా సాయి శ్రీమంత్ రెడ్డికి మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ ఎయిడెడ్ స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ విభాగంలో ఈ పట్టా లభించింది. ఈ అద్భుతమైన విజయం పట్ల పలువురు సాయి శ్రీమంత్ రెడ్డిని అభినందించారు.

# బీసీ ప్రజా సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా మదినేని మల్లేష్



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ:** తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా కాశీబుగ్గకు చెందిన మదినేని మల్లేష్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని తాత్కాలిక కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఈ నియామకం జరిగింది. ఈ కార్యక్రమంలో మదినేని మల్లేష్‌కు నియామక పత్రాన్ని అందజేసిన నాయిని భరత్, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ, తనకు పదవి రావడానికి సహకరించిన రాష్ట్ర నాయకులు చిత్తారి సంజీవ్ కుమార్, వాసం సాంబయ్య, సురేష్, బండారి దేవేందర్, గుంటి స్వప్నకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి చిత్తారి సంజీవ్ కుమార్, రాష్ట్ర మహిళా కార్యదర్శి రజిత, వరంగల్ తూర్పు నియోజకవర్గ మహిళా ఉపాధ్యక్షురాలు కుళ్ళ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

◆ ఇంఛార్జి కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఇంఛార్జి కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ తో కలిసి ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి అందిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. బయ్యారం మండలానికి చెందిన షబీరుద్దీన్: ఉన్నత విద్యను పూర్తి చేసిన తాను, బయ్యారంలో మీ-సేవ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందేందుకు అవకాశం కల్పించాలని కోరారు. డోర్నకల్ మండలం, ఎర్రమట్టి తండకు చెందిన జి. పద్మ: ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేసముద్రం మండలానికి చెందిన జాహేద తన భర్త గుండెపోటుతో మరణించారని, పిల్లలను పోషించడం కష్టంగా ఉందని, వితంతు పెన్షన్ ఇప్పించాలని కోరారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉద్యోగి గత 11 నెలలుగా జీతం ఇవ్వకుండా ఉద్యోగం నుంచి తొలగించారని, తిరిగి ఉద్యోగంతో పాటు పెండింగ్‌లో ఉన్న జీతం ఇప్పించాలని కోరారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 84 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు అప్పగించి, తక్షణమే పరిష్కార చర్యలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ పురుషోత్తం, బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహస్వామి, ఉద్యానవన పట్టు పరిశ్రమ అధికారి జినుగు మరియన్న, డీపీఓ హరిప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారి విజయ నిర్మల, పరిశ్రమల శాఖ అధికారి శ్రీమన్నారాయణ రెడ్డి, డి.డి. గ్రౌండ్ వాటర్ అధికారి సురేష్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశీరాం, ఎల్.డి.ఎం. పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, మత్స్య శాఖ అధికారి వీరన్న, మెప్మా అధికారి విజయ, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు మదన్ మోహన్, వినోద్, రాఘవరెడ్డి, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండ్ సదుపాయాలు కల్పించాలి



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలో బస్టాండ్, బస్సుల సదుపాయం లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు వెల్పుల రాజ్ కుమార్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్ సెల్‌లో అధికారులకు వినతి పత్రం సమర్పించారు. డీఆర్‌ఓ, హనుమకొండ శ్రీ వై.వి. గణేష్ (ప్రత్యేక కలెక్టర్ – ఎస్ఆర్ఎస్‌పి)కు వినతిపత్రాన్ని అందజేసిన రాజ్ కుమార్, దామెర మండల కేంద్రంలో బస్‌షెల్టర్ లేక ప్రజలు వర్షం, ఎండలో రోడ్డు పక్కన వేచి ఉండాల్సి వస్తోందని తెలిపారు. హనుమకొండ–దామెర–పరకాల బస్సుల సర్వీసులను పెంచాలని, లాదెళ్ల, సింగరాజుపల్లి, వెంకటాపురం, పులుకుర్తి, గట్ల కనపర్తి, వెల్లంపల్లి, రాజిపేట్ వంటి గ్రామాల్లో బస్సులు ఆగేలా మార్గం ఏర్పాటు చేయాలని కోరారు. ఊరుగొండలో ఎక్స్‌ప్రెస్ బస్సులకు హాల్ట్ ఏర్పాటు చేస్తే సీతారాంపురం, పసరగొండ, దమ్మన్నపేట్, ఓగులాపూర్, తక్కలపాడు, ముస్త్యాలపల్లి గ్రామ ప్రజలకు సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. ప్రస్తుతం నిలిచిపోయిన పసరగొండ, ఓగులాపూర్, తక్కలపాడు, ముస్త్యాలపల్లి మార్గాల్లో బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. "గ్రామీణ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడేలా వెంటనే చర్యలు తీసుకోవాలని" వెల్పుల రాజ్ కుమార్ ప్రత్యేక కలెక్టర్‌ను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరామ్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పావుదాల మధుకర్, మండల ప్రధాన కార్యదర్శి గండు ముఖేష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు కొట్టె రమేష్, బీజేవైఎం సోషల్ మీడియా కన్వీనర్ ముత్యాల రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ

కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** 19 సంవత్సరాల లోపు పిల్లల్లో రోగ నిరోధక శక్తిని పెంచడానికి ఆల్బెండజోల్ మాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. సోమవారం ఉర్సులోని శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో ఎస్ఆర్ఆర్ తోట ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆశా వర్కర్ అనిత ఆధ్వర్యంలో ఆయన 105 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పిల్లల కడుపులో ఉండే నులిపురుగుల వల్ల రక్తహీనత, బరువు తగ్గడం వంటి సమస్యలు వస్తాయని తెలిపారు. ఈ సమస్యలను నివారించడానికి ప్రభుత్వం ఉచితంగా నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తుందని, ఈ అవకాశాన్ని పిల్లలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మాత్రలు వేసుకున్న తర్వాత పిల్లలకు ఏమైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే, తల్లిదండ్రులు వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్యం చేయించాలని సూచించారు.

# మధ్యాహ్న భోజనం అక్షయపాత్రకు అప్పగించొద్దు

■ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల నిరసన
■ మంత్రి కొండా సురేఖ ఇంటి ముట్టడి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్ర ఫౌండేషన్‌కు అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఇంటిని ముట్టడించారు. హనుమకొండలోని రాంనగర్‌లో ఉన్న మంత్రి నివాసం వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్న కార్మికులు, "మంత్రి బయటికి రావాలి", "కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి", "అక్షయపాత్రకు మధ్యాహ్న భోజనం అప్పగించవద్దు" అంటూ నినాదాలు చేశారు. గంటపాటు ధర్నా అనంతరం కార్మికులు మంత్రి ఇంటి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు, కార్మికుల మధ్య తోపులాట జరిగింది. సుబేదారి సీఐ రంజిత్ కుమార్ నేతృత్వంలో పోలీసులు సీఐటీయూ నాయకులను బలవంతంగా అదుపులోకి తీసుకుని సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ అరెస్టులను సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం వల్ల గత 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులు ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 11 నుంచి అమలు చేయాలనుకుంటున్న అక్షయపాత్రకు మధ్యాహ్న భోజన పథకం అప్పగింత చర్యలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, జిల్లా కార్యదర్శి అరూరి కుమార్, నాయకులు వాణి, ప్రభాకర్, ఉపేందర్‌తో పాటు దాదాపు 40 మంది మధ్యాహ్న భోజన కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు.

# పేదల గృహ స్వప్నాన్ని నెరవేర్చడమే లక్ష్యం

◆ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, పాలకుర్తి:** కొడకండ్ల మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు గృహ నిర్మాణ మంజూరు పట్టాలను పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద ప్రజల గృహ స్వప్నాన్ని నెరవేర్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఇల్లు లేని ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. లబ్ధిదారులు తమకు అందిన పట్టాలను సద్వినియోగం చేసుకోవాలని, త్వరలో గృహ నిర్మాణానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించబడతాయని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ, తమ ఇంటి కల నెరవేరినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, మాజీ సర్పంచులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

# రక్తహీనతను నిర్మూలిద్దాం



**వరంగల్ వాయిస్, పరకాల :** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పరకాల ఎంపీడీవో పెద్ది అంజయ్య సోమవారం హైస్కూల్, ఉర్దూ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ, 2 – 19 సంవత్సరాల లోపు పిల్లలు నులిపురుగుల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని, కాబట్టి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంవత్సరానికి రెండు సార్లు ఈ వయసు పిల్లలకు ప్రభుత్వ, ప్రైవేటు, అంగన్‌వాడీ పాఠశాలల్లో ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నాయని, వీటిని తప్పక వేసుకుని రక్తహీనతకు గురికాకుండా ఉండాలని ఆయన కోరారు. డాక్టర్ దివ్య మాట్లాడుతూ, పిల్లలకు హ్యాండ్ వాష్ టెక్నిక్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్, ఉర్దూ స్కూల్ హెడ్ మాస్టర్లు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది డాక్టర్ మాధవి, ఆరోగ్య విస్తరణ అధికారి రాజకుమార్, పర్యవేక్షకుడు సాంబయ్య, ఆరోగ్య కార్యకర్తలు రజిత, విద్యాసాగర్, స్వాతి ఏ.ఎన్.ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తొర్రూరు పట్టణంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సి రాజేందర్ రెడ్డి సోమవారం పరామర్శించారు. పట్టణంలోని 13వ వార్డులో అప్పలశెట్టి నాగమణి, గంగిశెట్టి వెంకటేశ్వర్లు, జాటోత్ సరోజ కుటుంబాలను, 12వ వార్డులో అలువాల అంజయ్య, గొల్లపెల్లి సురేష్, దారం నాగయ్య, గంగిశెట్టి వెంకటేశ్వర్లు కుటుంబాలను ఆమె పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆర్థిక సహాయం అందజేసి, వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

# గణపసముద్రం చెరువుకు దేవాదుల నీరు విడుదల చేయాలి



**వరంగల్ వాయిస్, గణపురం:** దేవాదుల ప్రాజెక్టు నుంచి గోదావరి నీటిని రామప్ప చెరువుకు తరలించిన విధంగా, గ్రావిటీ కెనాల్ ద్వారా గణపసముద్రం చెరువులోకి కూడా నీటిని విడుదల చేయాలని కోరుతూ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నవీన్ రావు ఆధ్వర్యంలో తహసీల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. గణపసముద్రం చెరువులోకి నీరు విడుదల చేయడం వల్ల ఆయకట్టు రైతులందరికీ ప్రయోజనం చేకూరుతుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దుగ్గిశెట్టి పున్నం చందర్, ఉపాధ్యక్షుడు మాదాసు మొగిలి, బూత్ అధ్యక్షుడు కాశెట్టి సాయి, మండల కన్వీనర్ మండల రాజు తదితరులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండలంలోని పెద్దాపూర్‌లోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఆత్మకూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ దామెర అనిత మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ డి–వార్మింగ్ డే కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులను దరిచేరకుండా నివారించవచ్చని ఆమె అన్నారు. విద్యార్థులు భోజనం చేయడానికి ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ అస్మా, ఏఎన్ఎం ఏటీపీ చంద్రకళ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జాతీయభావంతో దేశాన్ని ముందుకు నడిపించాలి



**వరంగల్ వాయిస్, చిట్యాల:** భారతీయ పౌరులంతా జాతీయభావం కలిగి దేశాభివృద్ధికి పాటుపడాలని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పోలసాని తిరుపతిరావు పిలుపునిచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో సోమవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన జాతీయ జెండా ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణ త్యాగాలు చేసిన మహనీయులను స్మరించుకోవాలని, ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని అన్నారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా, సోదర భావంతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. దేశంపై కన్నేసిన శక్తులను ఐకమత్యంతో తిప్పికొట్టాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో బుర్ర వెంకటేష్ గౌడ్, మైదం శ్రీకాంత్, తీగల జగ్గయ్య, సుదగాని శ్రీనివాస్, గుండ సురేష్, మందల మొగిలి, గజనాల రవీందర్, చింతల రాజేందర్, మార్తా అశోక్, కదం రాజు, తీగల వంశీ, నీలి సుధాకర్ రెడ్డి, సాదా సాదానందం, బుర్ర ఆ భిజ్ఞ, బుర్ర వితేష్, గోల్కొండ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం వద్దు

## 31 డివిజన్ లో అధికారుల పర్యటన



**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట:** నగరంలోని 31వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను స్టేట్ హౌసింగ్ బోర్డు ఎండీ గౌతమ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పయ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండీ గౌతమ్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం, ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు, ఎంఆర్ఓ, డీఈ, ఏఈ, ఇందిరమ్మ ఇళ్ల పథకం ఉన్నతాధికారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త రేషన్ కార్డుల పంపిణీ



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెల్ల రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా, వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సోమవారం హసన్‌పర్తి కేడీఆర్ ఫంక్షన్ హాల్‌లో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, రేషన్ డీలర్లు ఎమ్మెల్యే నాగరాజుకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం హసన్‌పర్తి మండలం, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 1, 2, 55, 56, 65, 66 డివిజన్ల పరిధిలోని ప్రజలకు ప్రయోజనం చేకూర్చింది ఇదే వేదికపై, కాంగ్రెస్ పార్టీ పథకాలకు ఆకర్షితులైన సీతానగరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎమ్మెల్యే నాగరాజు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, హసన్‌పర్తి మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా పోచమ్మ తల్లి బోనాలు



**వరంగల్ వాయిస్, నడికూడ :** శ్రావణమాసం సందర్భంగా నడికూడ గ్రామ దేవత శ్రీ పోచమ్మ తల్లికి విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా తొలి బోనం సమర్పించి, యాటలతో తల్లికి హారం ఇవ్వడం తమ ఆచారమని విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు తెలిపారు. ఉత్సవాల కోసం ఆలయాన్ని శుభ్రం చేసి, రంగులు వేశారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలు, డెకరేషన్, తాగునీటి సౌకర్యాలను కల్పించారు. కోరిన కోర్కెలు తీర్చే పోచమ్మ తల్లికి ఆదివారం మొదటి మొక్కులు సమర్పించి, వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కడివెండి నరేందర్ చారి, గౌరవ అధ్యక్షుడు బెజ్జంకి వెంకటయ్య చారి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎలకంటి రాజు చారి, ఉపాధ్యక్షుడు బెజ్జంకి రాజేందర్ చారి, ప్రధాన కార్యదర్శి బండ్ల రాజు చారి, కోశాధికారి కడివెండి ప్రశాంత్ చారి, సహాయ కార్యదర్శి బండ్లోజు రమేష్ చారి, కార్యవర్గ సభ్యులు బెజ్జంకి మహేందర్ చారి, వినుకొండ నవీన్ కుమార్ చారి, క్రిష్ణాది సాంబయ్య చారి, కడివెండి కృష్ణ మూర్తి చారి, బిక్షపతి చారి, కడివెండి సత్యం చారి, రాజు చారి, విశ్వబ్రహ్మణ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆ అవినీతి అధికారిపై చర్యలేవి.!

## బీజేపీ నేత బొల్లం కిషన్



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి అవినీతిపై దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బొల్లం కిషన్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత 30 సంవత్సరాలుగా ఆలయంలో తిష్ట వేసి, ఏకఛత్రాధిపత్యం చెలాయిస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్టు పనులలో కమీషన్లు దండుకుంటున్నారని, కిందిస్థాయి ఉద్యోగులకు పదోన్నతుల పేరుతో అడ్డగోలుగా డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఉద్యోగ నియామకాలలో అవకతవకలకు పాల్పడుతున్నారని, కొత్తగా జరిగిన అర్చకుల నియామకాల్లో భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఈ ఉద్యోగిపై ఇన్ని ఆరోపణలు వచ్చినా, సంబంధిత శాఖ అధికారులు, ముఖ్యంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి (ఈవో) నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని కిషన్ మండిపడ్డారు. ఈవో నిత్యం అందుబాటులో లేకపోవడం వల్ల ఆ ఉద్యోగికి ఆడింది ఆట, పాడింది పాటగా మారిందని ఆరోపించారు. మీడియాలో, సోషల్ మీడియాలో ఈ విషయంపై కథనాలు వస్తున్నా ఈవో స్పందించకపోవడం దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. అవినీతి అధికారిపై వస్తున్న ఆరోపణలపై ఆలయ ఈవో వెంటనే స్పందించాలని, లేకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బొల్లం కిషన్ హెచ్చరించారు.

# మూడో అంతస్తు నుంచి పడి రోగి మృతి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జ్వరంతో ఆసుపత్రిలో చేరిన ఒక వ్యక్తి, నిద్రమత్తులో ప్రమాదవశాత్తు భవనం మూడో అంతస్తు నుంచి పడి మృతి చెందిన విషాద ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిలో చోటుచేసుకుంది. ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామానికి చెందిన ఐలయ్య (50) మూడు రోజుల క్రితం జ్వరంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఈ రోజు తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో నిద్రమత్తులో మూడో అంతస్తులోని బాల్కనీ నుంచి కింద పడిపోయారు. ఈ ఘటనను గమనించిన ఆసుపత్రి సిబ్బంది వెంటనే వైద్య అధికారులకు సమాచారం అందించారు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుని బంధువులు సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి, పోస్టుమార్టం పూర్తయిన తర్వాత బంధువులకు అప్పగించారు.

# నిర్ఫ్ ర్యాంకింగ్‌పై కార్యశాల



**వరంగల్ వాయిస్, కేయూ:** తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ములుగు, సిద్దిపేటలోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యానవన విశ్వవిద్యాలయంలో "నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (నిర్ఫ్)"పై ఒకరోజు కార్యశాల నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, ఐక్యూఏసీ డైరెక్టర్ ఆచార్య జి. షమిత తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సలహాదారు డాక్టర్ కే. వీరంజనేయులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో ప్రామాణికాలు, కొలమానాలు, విశ్లేషణా విధానాలపై వివరంగా వివరించారు. విశ్వవిద్యాలయాల ప్రస్తుత స్థితిని మెరుగుపరచడానికి దృష్టి సారించాల్సిన కీలక అంశాలపై ప్రత్యేక సెషన్ నిర్వహించారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, విశ్వవిద్యాలయాల పనితీరు, ఖ్యాతి, స్వయం ప్రతిపత్తి ప్రాధాన్యతను నొక్కి చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి. బాలకిష్టా రెడ్డి మాట్లాడుతూ, విశ్వవిద్యాలయాల మధ్య సమన్వయం, వనరుల మార్పిడి, నైపుణ్యాల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యాచరణను వివరించారు. కార్యశాల ప్రారంభానికి ముందు, శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య డి. రాజి రెడ్డి, ఆచార్య కే. ప్రతాప్ రెడ్డికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

# దేశభక్తికి మారుపేరు బత్తిని మొగిలయ్య గౌడ్

## ◆ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు యాదగిరి గౌడ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** చరిత్ర మరచిన స్వాతంత్ర్య సమరయోధుడు బత్తిని మొగిలయ్య గౌడ్ 80వ వర్ధంతి కార్యక్రమం వరంగల్‌లోని జేపీఎన్ రోడ్‌లో ఉన్న బత్తిని మొగిలయ్య గౌడ్ హాల్‌లో ఘనంగా జరిగింది. మొగిలయ్య ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కూనూరు రంజిత్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ పోశాల పద్మ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బోనగాని యాదగిరి గౌడ్ మాట్లాడుతూ, బలమైన దేశభక్తి కలిగిన గీతకార్మికుడు బత్తిని మొగిలయ్య గౌడ్ అని కొనియాడారు. 1946 ఆగస్టు 11న, నిజాం ప్రభుత్వం త్రివర్ణ పతాక ఆవిష్కరణను నిషేధించినప్పటికీ, వరంగల్ తూర్పు కోటలో ఆయన హయగ్రీవాచారి, భూపతి కృష్ణమూర్తి, కె. సమ్మయ్య, మడూరి రాజలింగం, కెప్టెన్ మల్లయ్య, వైస్ కెప్టెన్ ఆరెల్లి బుచ్చయ్య, ఆర్య సమాజ్ కార్యకర్తలు, కాంగ్రెస్ వలంటీర్లతో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారని గుర్తు చేశారు. కాసిం షరీఫ్ నాయకత్వంలో 200 మంది రజాకార్లు దాడికి వచ్చినప్పుడు, జెండా ఎగురవేసిన నాయకులను రక్షించడానికి తన ప్రాణాలను పణంగా పెట్టి, అమరుడైన దేశభక్తుడు బత్తిని మొగిలయ్య అని అన్నారు. ఆయన త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు. బీసీ సంక్షేమ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ, అంతటి దేశభక్తి కలిగిన బత్తిని మొగిలయ్య గౌడ్ జయంతి, వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. మొగిలయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలో వరంగల్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొగిలయ్య ఫౌండేషన్ ఉపాధ్యక్షులు ఉమ్మగాని గణేష్, గట్ల యుగేందర్, కార్యదర్శులు కంకటి సాగర్, కూనూరు రాకేష్, పోశాల స్వామి, ఆనంతుల రమేష్, మడిపల్లి కృష్ణ, గట్టు నరేష్ గౌడ్, రావుల రమేష్, నాగపూరి బలరాం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసు ఛేధించిన పోలీసులు

## నిందితుడు శ్రీనివాస్ అరెస్ట్




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఈ నెల 3న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని లెనిన్ నగర్‌లో జరిగిన తూళ్ల ప్రభాకర్ హత్య కేసును పోలీసులు ఛేధించారు. ఈ హత్యకు పాల్పడిన సంపతు శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తిరుపతి రావు మీడియా సమావేశంలో వెల్లడించారు. లెనిన్ నగర్‌కు చెందిన తూళ్ల ప్రభాకర్ (35), సంపతు శ్రీనివాస్ స్నేహితులు. ఆగస్టు 3న రాత్రి ఇద్దరూ మద్యం సేవించిన తర్వాత వారి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో శ్రీనివాస్ పొడవాటి కర్రతో ప్రభాకర్‌ను దారుణంగా కొట్టి హత్య చేసి పారిపోయాడు. హత్య జరిగిన వెంటనే పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు శ్రీనివాస్ హత్య తర్వాత ఖమ్మం వెళ్లి అక్కడ ఒక మిల్లులో పని చేసుకుంటూ వచ్చిన డబ్బుతో జల్సాలు చేసినట్లు గుర్తించారు. సోమవారం ఖమ్మం నుంచి మహబూబాబాద్ తిరిగి వస్తుండగా, నెహ్రూ సెంటర్‌లో పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా, ప్రభాకర్‌ను హత్య చేసినట్లు అంగీకరించాడు. హత్య కేసును త్వరితగతిన ఛేధించిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అభినందించారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

# నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం

## డాక్టర్ మేరుగు యశస్విని




**వరంగల్ వాయిస్, వరంగల్ :** నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఎన్.ఎల్ ఈపీ/హెచ్ఐవీ ఎయిడ్స్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మోహన్ సింగ్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం వరంగల్ జిల్లాలోని ఏ.వీ.వీ. హైస్కూల్, ఆంధ్ర బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు డాక్టర్ మేరుగు యశస్విని నులిపురుగుల మాత్రలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ సింగ్ మాట్లాడుతూ, బాలబాలికల ఆరోగ్యానికి నులిపురుగుల నివారణ అత్యంత ముఖ్యమని చెప్పారు. నులిపురుగుల నివారణ కోసం 1– 2 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు భోజనం తర్వాత సగం ఆల్బెండజోల్ మాత్రను,3 – 19 సంవత్సరాల వయస్సు ఉన్న విద్యార్థులకు భోజనం తర్వాత ఒక మాత్రను అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యశస్విని, డీపీహెచ్ఎన్ఓ మనోజ, డీఏపీసీయూ యూనిట్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ ఎన్.స్వప్న మాధురి, డిస్ట్రిక్ట్ ఐసీటీసీ సూపర్వైజర్ అడేపు రామకృష్ణ, డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ కమలాకర్, యు.ఎఫ్.డబ్ల్యూసీ ఎంజీఎంపీపీ యూనిట్ సూపర్వైజర్ నర్మద, ఏఎన్ఎంలు లక్ష్మి బాయ్, రాజసులోచన, ఆశ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన లా స్కాలర్ల ఓరియంటేషన్ తరగతులు



**వరంగల్ వాయిస్, కేయూ:** కాకతీయ యూనివర్సిటీ (కేయూ) న్యాయ కళాశాలలో 2024 బ్యాచ్ పీహెచ్.డీ స్కాలర్లకు నిర్వహించిన వారం రోజుల కోర్సు వర్క్ ఓరియెంటేషన్ తరగతులు నేటితో ముగిసాయి. సోమవారం మధ్యాహ్నం జరిగిన ముగింపు కార్యక్రమానికి కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ వి. రామచంద్రం మాట్లాడుతూ, ఈ వారం రోజుల్లో నేర్చుకున్న విషయ పరిజ్ఞానాన్ని తమ పీహెచ్.డీ సిద్ధాంత వ్యాసంలో ఉపయోగించి ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన పరిశోధనలు చేయాలని స్కాలర్లకు సూచించారు. గౌరవ అతిథిగా హాజరైన ప్రొఫెసర్ జి. రామేశ్వరం, పరిశోధకులు కష్టపడి, అంకితభావంతో, సానుకూల దృక్పథంతో ఆదర్శవంతమైన పరిశోధకులుగా ఎదగాలని కోరారు. ఈ నెల నాలుగో తేదీన ప్రారంభమైన ఈ తరగతులకు లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. సుదర్శన్ కోఆర్డినేటర్ గా వ్యవహరించారు. 30 సంవత్సరాలకు పైబడిన అనుభవం ఉన్న వివిధ రంగాల నిపుణులు ఈ తరగతులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో నిర్వహించారు. కొచ్చిన్‌లోని జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.బి. రెడ్డి, మహారాష్ట్ర జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ మాజీ రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ జయకుమార్, వైజాగ్‌లోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ సి.పి. నందిని, తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ మాజీ రెక్టర్ ప్రొఫెసర్ కే. ఉమాదేవి, ద్రావిడ విశ్వవిద్యాలయ మాజీ కంట్రోలర్ డాక్టర్ ఎం. అంజయ్య, కేయూ మాజీ ప్రొఫెసర్లు జి. రామేశ్వరం, ప్రొఫెసర్ కే. రాజేందర్, న్యాయ విభాగం డీన్ ప్రొఫెసర్ ఎం. శ్రీనివాస్, మాజీ ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ బి. విజయలక్ష్మి, టి. విజయ చంద్ర వంటి ప్రముఖులు రీసెర్చ్ మెథడాలజీకి సంబంధించిన అంశాలపై స్కాలర్లకు సుదీర్ఘ ఉపన్యాసాలు ఇచ్చారు. కోర్సు పూర్తయిన తర్వాత, స్కాలర్లు తాము పొందిన జ్ఞానం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రిన్సిపాల్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రిజిస్ట్రార్ వి. రామచంద్రం, ప్రొఫెసర్ జి. రామేశ్వరంలను ప్రిన్సిపాల్ డాక్టర్ సుదర్శన్ సన్మానించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. సుదర్శన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రభాకర్ అతిథులను ఆహ్వానించగా, సీ.హెచ్. శ్రీనివాస్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోలా శంకర్, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.




# మాస్ జాతర టీజర్ విడుదల

కథానాయకుడు రవితేజ నుంచి రానున్న 75వ చిత్రం 'మాస్ జాతర'భాను భోగవరపు దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ సినిమాలో శ్రీలీల కథానాయిక. ఆగస్టు 27న ఇది విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం తాజాగా టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో రవితేజ పోలీస్ పాత్రలో 'నాకంటూ ఓ చరిత్ర ఉంది..' అంటూ మాస్ డైలాగులతో అలరిస్తూ కనిపించారు. ఈ మాస్ మహారాజ్ పంచ్‌లు వేస్తోన్న టీజర్‌ను చూసిన వారు బాగుందని అంటున్నారు.

# వందకోట్ల క్లబ్‌లో చేరిన కింగ్‌డమ్

కథానాయకుడు విజయ్ దేవరకొండ నటించిన కింగ్‌డమ్ చిత్రం తాజాగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ విషయాన్ని చిత్రబృందం ప్రకటించింది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఈ సినిమాకు నాగవంశీ నిర్మాతగ వ్యవహరించగా.. భాగ్యశ్రీ భోర్సే కథానాయికగా నటించింది. అయితే జూలై 31న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మొదటిరోజు నుంచే బాక్సాఫీస్ వద్ద పరుగులు పెడుతుంది. తాజాగా ఈ చిత్రం రూ.100 కోట్ల క్లబ్‌లో చేరినట్లు– మేకర్స్ ప్రకటించారు. దీంతో గీతా గొవిందం(రూ.130 కోట్లు–) తర్వాత రెండోసారి రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన హీరోగా విజయ్ రికార్డును అందుకున్నాడు.

# ఆ రెండు వేరువేరు

సామాజిక మాధ్యమాల్లో ఎన్ని విమర్శలు ఎదురైనప్పటికీ దృఢంగా ఉండి.. నా కెరీర్‌పైనే దృష్టి పెడుతున్నానని అందాల తార రష్మిక అంటోంది. 'పుష్ప 2', 'కుబేర' చిత్రాలతో వరుస విజయాలందుకొని జోరుమీదుందీ భామ. ప్రస్తుతం మహిళా ప్రాధాన్య కథలతో బిజీగా గడుపుతున్న ఆమె.. తన భావోద్వేగాలను ప్రజల ముందు ప్రదర్శించడానికి ఇష్టపడనని అంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రష్మిక మాట్లాడుతూ.. నేను ఒక నటిని. నా వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితానికి చాలా వ్యత్యాసం ఉంటుంది. నేను ఇంట్లో ఎలా ఉంటానో చూస్తే మీరు ఆశ్చర్యపోతారు. చాలా ఎమోషనల్ పర్సన్‌ని నేను. కానీ నేను నా భావోద్వేగాలను బయటికి చూపించను. ఎందుకంటే అభిమానులు నా దయా గుణాన్ని నా బలహీనత అనుకుంటారు. లేకపోతే నేను కెమెరాల కోసమే ఇదంతా చేస్తున్నా అనుకుంటారు. మనం ఎంత నిజాయతీగా ఉంటే.. అంత వ్యతిరేకత మనపై వస్తుంది.




# సుధీర్ బాబు.. నిఖిల్ సినిమాలు

ఇద్దరికీ పరీక్ష పెట్టనున్న జటాధర, స్వయంభు ఒక్కోసారి కథ కాదు టైటిల్ లోనే పవర్ కనిపిస్తుంది. ఆడియన్స్ ను ముందు థియేటర్ కి రప్పించేవి –టైటిల్సే. అలాంటి ఓ మంచి టైటిలే జటాధర... ఒక పవిత్రమైన శబ్దం. శివుడి రూపం. శాంతంగా కనిపించినా శత్రువుల మీద శివతాండవం చేస్తాడు. ఇప్పుడు అదే ఫార్ములాతో సుధీర్ బాబు మళ్లీ వచ్చాడు! మాస్ హిట్ కోసం ఎదురు చూస్తున్న సుధీర్ బాబుకు ఈ సినిమా మంచి హిట్ అవుతుందని ఫీలవుతున్నారు ఆయన ఫ్యాన్స్. తెలుగు, హిందీ రెండు భాషల్లో రానున్న ఈ సినిమాలో సోనాక్షి సిన్హా హీరోయిన్. భాగీతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన సుధీర్ బాబు ఈసారి ఎపిక్ వార్ జటాధర తో ఎలాంటి హైప్ క్రియేట్ చేసుకుంటాడో చూడాలి...ఈసారి హిట్ కొడితే తెలుగులో ఆయన కెరీర్‌లో టర్నింగ్ పాయింటే అవ్వాలని, ఫెయిల్యూర్స్ ని ఎరేజ్ చేసే ఎపిక్ వార్ జటాధర కావాలని ఆయన అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. ఇక నిఖిల్ కార్తికేయ 2 వంటి భక్తి , మిస్టరీ, యాక్షన్ థ్రిల్లర్ తో పాన్ ఇండియా విజయం అందుకున్నాడు. ఇప్పుడు అదే షేడ్స్ తో 'స్వయంభు' వస్తోంది. స్వయంభు లో మహాభారతం టచ్, హీరో లుక్‌లో వారియర్ వైబ్రేషన్, విజువల్స్‌లో ఓ ఎపిక్ వార్ ఫీల్ కనిపిస్తోంది. మోషన్ పోస్టర్ , ఓ పెనింగ్ గ్లింప్స్ గ్రాండియర్ లుక్ లో కనిపిస్తున్నాయి. ఫుల్ క్లాస్ ఎండ్ మాస్ అప్పీల్ తో ఈ సినిమా రాబోతున్నట్టు కనిపిస్తోంది. డైరెక్టర్ భరత్ క్రిష్ణమాచారి విజువల్ స్కేల్ కు ప్రాధాన్యం ఇస్తున్నాడు. బాహుబలి, ట్రిపుల్ లాంటి విజువల్ వండర్స్ కి రూపం ఇచ్చిన సెంథిల్ కుమార్ స్వయంభుకి సినిమాటోగ్రాఫర్ గా చేస్తున్నాడు. నిఖిల్ సరసన సంయుక్త మీనన్ నటిస్తోంది. దాంతో స్వయంభు మీద భారీ ఆశలే పెట్టుకున్నాడు నిఖిల్. ఇద్దరి యంగ్ హీరోలకు ఇప్పుడు హిట్ అనేది చాలా కీలకం.










వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, ఆగస్టు 11, 2025

# సన్నద్ధంగా ఉండండి..

- నెలాఖరులో 'స్థానిక' నగారా
- క్యాడర్‌కు టీపీసీసీ ఆదేశాలు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక సంస్థల ఎన్నికలకు ఈ నెలాఖరులో నగారా మోగే అవకాశాలున్నాయి. ఎన్నికలకు క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను సన్నద్ధం చేయాలని టీపీసీసీ నుంచి ఎమ్మెల్యేలు, నాయకులకు ఆదేశాలు అందినట్లు సమాచారం, రాజకీయాల్లో, విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయమై చేసిన బిల్లులు, ఆర్డినెన్స్‌లు ఆమోదం కోసం రాష్ట్రపతి చెంతకు చేరాయి. వాటిని ఆమోదించేలా ఇటీవల మూడు రోజుల పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి సహ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు ఢిల్లీలోనే ఉన్నారు. జంతర్ మంతర్ వద్ద ఇండియా కూటమి ఎంపీలతో కలిసి ధర్నా చేశారు. పార్లమెంట్‌లో చర్చకు వాయిదా తీర్మానాలు ఇస్తే ప్రభుత్వం తోసి పుచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించిన మేరకు గడువు ముంచుకు వస్తున్నది. ఆ గడువులోగానే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఓవైపు.. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై కేంద్రంపై ఒత్తిడి పెంచుతూనే, మరోవైపు ఎన్నికల నిర్వహణకు అధికార పార్టీ సన్నద్ధం అవుతున్నది. రాజకీయాల వ్యవహారాల కమిటీ (పీఏసీ)లో, మంత్రులతో చర్చించిన తర్వాత ఎన్నికలపై ముందుకు సాగుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన మేరకు రెండు, మూడు రోజుల్లో సమావేశాలు నిర్వహించేందుకు సన్నద్ధం అవుతున్నారని పార్టీ వర్గాల సమాచారం. ఎన్నికల విషయమై ప్రభుత్వం మూడు మార్గాలను అన్వేషిస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో తీసుక వచ్చిన పంచాయతీరాజ్ చట్టంలో పేర్కొన్న 50 శాతం రిజర్వేషన్ల నిబంధనను పక్కనబెట్టి జీఓ తీసుకరావడం, ఎన్నికలు నిర్వహించకుండా నిలువరించడం, పార్టీ పరంగా 42 శాతం సీట్లు కేటాయించే మార్గాలను అన్వేషిస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఇప్పటికే ఆలస్యమయ్యింది. ఏడాది నుంచి ఏడాదిన్నర కాలంగా మండల, జిల్లా పరిషత్‌లు, గ్రామ పంచాయతీలు, ఆరు మాసాలుగా మున్సిపాలిటీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నది. ఎన్నికలు నిర్వహించని కారణంగా కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రాక గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. ఎన్నికల నిర్వహణలో జాప్యంపై ప్రభుత్వంపై రాజకీయ పక్షాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

### పార్టీ పరంగా 42 శాతం సీట్లు..

రిజర్వేషన్లపై జీఓ తీసుకువస్తే ఎవరైనా కోర్టును ఆశ్రయించే అవకాశాలున్నాయి. చివరగా పార్టీ పరంగా 42 శాతం సీట్లు బీసీలకు కేటాయించి ముందుకు పోవాలని భావిస్తున్నారు. మొదట జీఓ జారీ చేసి, దాని పర్యావసానాన్ని గమనిం చిన తర్వాత ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఎట్టిపరిస్థితుల్లో ఈ నెలాఖరు వరకు గ్రామ పంచాయతీ లేదా మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో ఏదో ఒక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశాలున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి 50 శాతానికి మించకుండానే జనాభా, ఓటర్ల ప్రాతిపదికన స్థానాలను రిజర్వు చేయనున్నారు. సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్మన్ స్థానాలకు రొటేషన్ ప్రకారమే రిజర్వు చేయనున్నారు. 42 శాతం రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం లభించకుంటే ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్రంలో ఉన్న భారతీయ జనతా పార్టీ వైఖరిని ఎండగట్టాలని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టంలో చేసిన 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల విషయాన్ని కూడా ప్రజల్లోకి తీసుకపోవాలని భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన 20 నెలల కాలంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి గురించి విస్తృత ప్రచారం చేపట్టాలని నిర్ణయించారు. చట్టపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం చేసిన కులగణన సర్వే, అసెంబ్లీలో ఆమోదం పొందిన బిల్లులు, పంచాయతీరాజ్ చట్ట సవరణ కోసం తీసుక వచ్చిన ఆర్డినెన్స్‌ల గురించి ప్రజలకు వివరించాలని భావిస్తున్నారు.

# గ్రామీణ యువతకు ఈ-కామర్స్ శిక్షణ

- విస్తరించాలని కోరిన ఎంపీ కడియం కావ్య
- స్పందించిన కేంద్ర మంత్రి జయంత్ చౌదరి

**వరంగల్ వాయిస్, న్యూ ఢిల్లీ:** గ్రామీణ యువతకు ఈ–కామర్స్ (ఆన్‌లైన్ వ్యాపారం) శిక్షణను మరింత విస్తరించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖను కోరారు. ఈ అంశంపై ఆమె లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి జయంత్ చౌదరి సమాధానమిచ్చారు. 2022–23లో వరంగల్‌లో 170 మంది యువతకు ఆన్‌లైన్ వ్యాపారం, డిజిటల్ మార్కెటింగ్‌లో శిక్షణ ఇచ్చామని మంత్రి తెలిపారు. తెలంగాణలో వన్ ధన్ కేంద్రాలు: తెలంగాణలో 2025 జూలై నాటికి 25 వన్ ధన్ వికాస్ కేంద్రాల ద్వారా 1,461 మందికి శిక్షణ ఇచ్చి, గిరిజన కుటుంబాల ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేశామని పేర్కొన్నారు. సౌర విద్యుత్ శిక్షణ: 2025–26లో 30 మందికి సౌర విద్యుత్ వ్యాపారంపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. మార్కెట్ యాక్సెస్ కోసం 2024 ఆగస్టు 13న ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ONDC), గవర్నమెంట్ ఈ–మార్కెట్‌ప్లేస్ (GeM)తో ఒప్పందాలు కుదుర్చుకున్నామని మంత్రి వివరించారు. అలాగే, 2023 సెప్టెంబర్ 4న మెటా సంస్థతో ఒప్పందం ద్వారా డిజిటల్ మార్కెటింగ్ శిక్షణను బలోపేతం చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, గ్రామీణ, గిరిజన యువతకు స్థిరమైన ఆదాయం కల్పించడానికి, స్వయం ఉపాధి అవకాశాలను పెంచడానికి తెలంగాణ రాష్ట్రంలో ఈ–కామర్స్ శిక్షణను మరింత విస్తరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.




# నులిపురుగుల నివారణతో పిల్లల ఆరోగ్యం

- డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని లష్కర్ బజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డి.ఎం.హెచ్.ఓ) డాక్టర్ ఏ. అప్పయ్య, జిల్లా విద్యా శాఖ అధికారి (డీఈఓ) వాసంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏ. అప్పయ్య మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం రెండు విడతల్లో 1 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లల్లో నులిపురుగులను నిర్మూలించడానికి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1636 కేంద్రాలలో 2,35,000 మంది పిల్లలకు మాత్రలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 18న మాప్–అప్ రౌండ్ నిర్వహించబడుతుందని చెప్పారు. కేవలం మాత్రలు తీసుకోవడమే కాకుండా, నులిపురుగుల నివారణకు వ్యక్తిగత పరిశుభ్రత అత్యంత అవశ్యకమని ఆయన నొక్కి చెప్పారు. ముఖ్యంగా మలవిసర్జన తర్వాత, భోజనానికి ముందు, ఆటలాడిన తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకుండా మరుగుదొడ్లను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. డీఈఓ వాసంతి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని, విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణించగలరని అన్నారు. క్రమం తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ వల్ల పిల్లలలో నులిపురుగుల ప్రభావం గణనీయంగా తగ్గిందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ మహేందర్ అన్నారు. అడిషనల్ డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ టి. మదన్ మోహన్ రావు, డిప్యూటీ డి.ఎం. హెచ్.ఓ డాక్టర్ విజయ్ కుమార్, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ హిమ బిందు, ఇతర ప్రోగ్రాం అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించారు. ఇదే విధంగా, డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ.అప్పయ్య బోడగుట్ట పట్టణ ఆరోగ్య కేంద్రం, దర్గా బస్తీ దవాఖానాలను ఆకస్మికంగా సందర్శించి కార్యక్రమాలను సమీక్షించారు. దర్గా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని కూడా ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ గీత, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి, మండల విద్యా శాఖ అధికారి నెహ్రూ నాయక్, ప్రధానోపాధ్యాయురాలుఉమాదేవి, పీహెచ్ఎన్ రమేశ్వరి, సూపర్వైజర్లు, ఏ.ఎన్.ఎం.లు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# టెన్నిస్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తా

**ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అజీజ్ ఖాన్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలో టెన్నిస్ క్రీడ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ.అజీజ్ ఖాన్ స్పష్టం చేశారు. సోమవారం టెన్నిస్ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అజీజ్ ఖాన్ మాట్లాడుతూ, జేఎన్ఎస్ స్టేడియంలోని టెన్నిస్ కోర్టులో ఫ్లడ్‌లైట్లు, క్లే కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హనుమకొండ టెన్నిస్ అసోసియేషన్ ప్యాట్రాన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇ.వి. శ్రీనివాస్ మాట్లాడుతూ, హనుమకొండలో టెన్నిస్ క్రీడ విస్తరిస్తున్న నేపథ్యంలో అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలో టెన్నిస్ పోటీలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమని టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబు రెడ్డి అన్నారు. హనుమకొండ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నల్ల సురేందర్ రెడ్డి, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి మాట్లాడుతూ,



జిల్లాలోని ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రతినెలా టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో ఏసీపీ నాగయ్య–శ్రీధర్ (ఆర్.ఐ) జోడీ ప్రథమ స్థానం పొందగా, శివరాజ్–రోహిత్ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ టెన్నిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఏసీపీ అంబటి నర్సయ్య, పాట్రన్ కె. రవిచంద్ర, కోశాధికారి సిరికొండ సుదర్శన్, ఉపాధ్యక్షులు కుంజు బిహారి, వెంకట్ నారాయణ, మల్లారెడ్డి, పెరుమాండ్ల వెంకట్, వినీల్, సాత్విక్, వినయ్ వర్ధన్ రెడ్డి, కార్తీకుమారి, రడం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అర్సం సోహాలికకు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు

**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ తూర్పు కోటకు చెందిన అర్సం రాంబాబు, స్వాతి దంపతుల కుమార్తె అర్సం సోహాలిక, యోగాసన స్పోర్ట్స్‌లో జాతీయ, రాష్ట్ర స్థాయిలలో మంచి ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఈ ప్రతిభకు గాను ఆమె బాసర ట్రిపుల్ ఐటీలో స్పోర్ట్స్ కోటాలో సీటు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం రంగశాయిపేటలో వరంగల్ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో సోహాలికను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా యోగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె.చంద్రశేఖర్ ఆర్య, అధ్యక్షుడు బోలిశెట్టి కమలాకర్, ప్రధాన కార్యదర్శి




పాకాల కృష్ణవేణి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పాకాల కృష్ణవేణి, కోశాధికారి ఆడుప సాంబశివరావు, ఉపాధ్యక్షులు మండల నరసింహ రాములు, సహాయ కార్యదర్శి కోట రజిత, డాక్టర్ కె. రాజేశ్వరి, పాకాల రవి, ఈసీ సభ్యులు ప్రేమలత, జ్యోతి, ఎస్. మౌనిక, కడారి మహేష్, శ్రీనివాస్, ఎండీ పాషా పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com